క్లుప్తంగా

ఆంజనేయస్వామికి అభిషేక పూజలు


పూజలందుకుంటున్న అంజనేయస్వామి

కౌతాళం: మండలంలోని అంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలివచ్చి పూజలు నిర్వహించారు. దీంతో స్వామి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. మండల కేంద్రమైన కౌతాళంతో పాటు మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజినేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజినేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలను చేపట్టారు. మండల కేంద్రమైన కౌతాళంలో వెలసిన వెంకటేశ్వర ఆలయంలో పూజలు చేపట్టారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ


విద్యార్థులకు ప్యాడ్స్ పంపిణీ చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ బాలుర వసతిగృహం-1 పదవ తరగతి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని శనివారం పంపిణీ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వసతి గృహం వార్డెన్ సిద్ధప్ప చేతులు మీదుగా పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలను సాధించేదిశగా చదువుకోవాలన్నారు. మొక్కుబడిగా కాకుండా ఇష్టంతో చదివినప్పుడే ఆ ఫలితాలను చూడగలుగుతామన్నారు. కార్యక్రమంలో సంక్షేమ బాలుర వసతి గృహం వార్డెన్ నాగమద్దయ్య ఎస్ఎఫ్ఐ నాయకులు సంజయ్, నరసింహ, ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తికి గాయాలు

కోసిగి: మండల పరిధిలోని వందగల్లు గ్రామానికి చెందిన గోవిందు అనే వ్యక్తి సెంట్రింగ్ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాలయ్యాయి. కోసిగిలోని 9వ వార్డులో కొత్తగా నిర్మిస్తున్న ఓ ఇంటికి మెట్ల వద్ద సెంట్రింగ్ పనులు చేస్తుండగా కడ్డీలు కోసే వైర్‌కు కాలు తగలడంతో షాక్‌కు గురయ్యాడు. దీంతో గోడకు బలంగా తల తగలడంతో తీవ్ర గాయమైంది. గమనించిన తోటి కూలీలు అప్రమత్తమై కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు తీసుకొచ్చారు. అక్కడ డాక్టర్ మౌనిక ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వీఆర్‌ఏ మూకప్ప మృతి


మూకప్ప (ఫైల్)

ఆదోని రూరల్: మండలంలోని చిన్నహరివాణం గ్రామంలో వీఆర్‌ఏగా పనిచేస్తున్న టి.మూకప్ప అనారోగ్యం కారణంగా శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆదోని తహసీల్దార్ శివరాముడు మట్టి ఖర్చుల నిమిత్తం మృతుడి కుటుంబ సభ్యులకు రూ.25 వేలు అందజేశారు. డిప్యూటీ తహసీల్దార్ గుండాలనాయక్, ఆర్ఐ కాశీం, చిన్నహరివాణం వీఆర్వో శ్రీనివాసులు, చిన్న ఈరన్న, జిల్లా నాయకులు వెంకటేశులు, డివిజన్ అధ్యక్షులు సోలా శ్రీనివాసులు, మండలాధ్యక్షులు వీరేష్, హనుమంతు తదితరులు నివాళులర్పించారు.

పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్ల సమస్యలు పరిష్కరించాలి

ఆదోని రూరల్: ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ, సమగ్ర శిక్షలో పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్స్, ఆర్ట్, వర్క్, హెల్త్ ఎడ్యుకేషనర్లుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎస్.కీర డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్స్ సమస్యలపై అసెంబ్లీలో చర్చించడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఎన్నో ఏళ్లుగా తమ సమస్యలు, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్స్ అనే పదం తీసి ఫుల్ టైం ఒకేషనల్ టీచర్స్‌గా పేరు మార్చాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు.

కమిషనర్ విస్తృత పర్యటన

ఆదోని టౌన్: పట్టణంలో ప్రధాన రోడ్లు, మురుగువాడల్లో ఏరోజుకారోజు చెత్తకుప్పలను ఎత్తివేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ శానిటేషన్ అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. వెంగళాపురం వీధి, క్రాంతినగర్, పాత బస్టాండు సర్కిల్‌లోని అన్నా క్యాంటీన్‌లను పరిశీలించారు. రెవెన్యూ ఆఫీసర్, ఆర్ఐ, బిల్ కలెక్టర్లతో కలిసి పన్నుల వసూలు కోసం పలు వీధుల్లో కలియతిరిగారు.

హామీ మరిచారు.. రైతులు విసుగుచెందారు!

- అధ్వానంగా పెసలదిన్నె- పెద్దమర్రివీడు పొలాల రహదారి
- గెలిస్తే రోడ్డు వేయిస్తానని ఎన్నికల్లో కూటమి అభ్యర్థి హామీ
- అధికారం చేపట్టి తొమ్మిదినెలలైనా పట్టికోని వైనం
- సొంతంగా రోడ్డు నిర్మాణానికి పూనుకున్న రైతులు
- చందాలు వేసుకొని మూడు కిల్లోమీటర్ల మేర గ్రావెల్ రోడ్డు పనులు


రోడ్డు గుంతలో ఇరుక్కున్న గ్రావెల్ ట్రాక్టర్


గ్రావెల్‌ను తీసుకువస్తున్న ట్రాక్టర్లు

ఎమ్మిగనూరురూరల్: రైతులు ఆరుగాలం పండించిన పంటను కోత కోసి ఇంటికి తెచ్చుకోవాలంటే నరకం చూడాల్సి వస్తోంది. పొలలకు రోడ్లను వేయిస్తామని ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి రోడ్డు హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలయినా ఇప్పటి వరకు స్పందించకపోవడంతో రైతులు విసుగుచెంది సొంత ఖర్చులతో రోడ్డు వేసుకోవటానికి పూనుకున్న ఘటన ఎమ్మిగనూరు మండలం పెసలదిన్నె గ్రామంలో శనివారం చోటు చేసుకుంది.

ఇక లాభంలేదనుకొని..

పెసలదిన్నె గ్రామం నుంచి గోనెగండ్ల మండల పెద్దమర్రివీడు గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. పొలాలకు ఎద్ల బండ్లు వెళ్లాలన్నా, కోత కోసిన పంటను ఇంటికి తీసుకురావాలన్నా కష్టతరంగా మారింది. వర్షాకాలం వచ్చిందంటే అడుగుపెట్టలేని పరిస్థితి. బురదలో బండ్లు ఇర్కుపోవాల్సిందే. ఈ ప్రాంతంలో రైతులు మిరప, వేరుశనగ, పత్తి, పొగాకు, జొన్న, ఇతర పంటలను సాగు చేస్తున్నారు. ఎన్నికల సమయంలో కూటమి అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి పొలాలకు రోడ్డు వేయించి రైతుల కష్టం తీరుస్తాని హామీ ఇచ్చారు. అయితే గెలిచాక ఇప్పటి వరకూ పట్టించుకోకపోవడంతో ఇక లాభంలేదనుకొని దాదాపు 50 మంది రైతులు కలిసి ఎకరాకు కొంత డబ్బును నిర్ణయించి శనివారం ఉదయం నుంచి పనులు మొదలు పెట్టారు.


గ్రావెల్‌ను చదును చేస్తున్న జేసీబీ

3 కిలోమీటర్ల మేర గ్రావెల్ రోడ్డు

10 ట్రాక్టర్లు, జేసీబీని పెట్టి 3 కిలోమీటర్ల వరకు గ్రావెల్ రోడ్డు వేసుకున్నారు. ఒక్కొక్క ట్రాక్టర్ గ్రావెల్ రూ. 600, జేసీబీకు గంటకు రూ. 1000 డబ్బులు చెల్లించాలని బాడుగకు తీసుకున్నట్లు ఆయ్యన్న, శంకరన్న, శ్రీనివాసులు, కురవ శంకరన్న, రామాంజనేయులు, మల్లికార్జున, రాజన్న, నరసన్నలతో పాటు మరి కొందరు రైతులు తెలిపారు. 200 ట్రిప్పుల గ్రావెల్ వేసినట్లు, ఇంకా వేయాల్సి వస్తుందని చెబుతున్నారు. ఎమ్మెల్యే గారు ఇప్పటికైనా స్పందించి రైతుల ఇబ్బందులను గుర్తించి, వారి సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు వెళ్లాలని ప్రజలు కోరుతున్నారు.

విసుగుచెంది మేమే వేసుకుంటున్నాం



ఎన్నికల ముందు కూటమి అభ్యర్థి రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చారు, కానీ ఇంత వరకు పట్టించుకోలేదు. దీంతో విసుగుచెదాం, పార్టీలకు సంబంధం లేకుండా రైతులందరు గ్రావెల్ రోడ్డు వేసుకోవాలని నిర్ణయించుకొని వేసుకున్నాం. పొలాలకు వెళ్లాలంటే చాల ఇబ్బందులు పడేవాళ్లం, మాకు తప్పింది కాదని భావించి మేమే రోడ్డు వేసుకోవాటానికి సిద్ధం అయ్యాం.

– అయ్యన్న, రైతు, పెసలదిన్నె

ఇబ్బందులు పడుతున్నాం



పొలాలకు వెళ్లే రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఎన్నికల ముందు వేయిస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావస్తున్నా మా గురించి ఎవరు పట్టించుకోవడం లేదు. అందుకే యాభై మంది రైతులు ఎకారకు కొంత డబ్బును నిర్ణయించి గ్రావెల్ వేయించుకుంటున్నాం. ఇప్పుడైనా నాయకులు కళ్లు తెరవాలి, రైతుల ఇబ్బందుల గూరించి ఆలోచించాలి.

–శంకరన్న, శ్రీనివాసులు, పెసలదిన్నె

కొనసాగిన గాలింపు చర్యలు


ఎల్‌ఎల్‌సీ కాలువలో గాలింపు చేపడుతున్న ఫైర్ సిబ్బంది

ఆదోని అర్బన్: పట్టణంలోని బోయగేరికి చెందిన శేఖర్ కుమారుడు హరికృష్ణ శుక్రవారం ఈతకు వెళ్లి బసాపురం ఎల్లెల్సీ కాలువలో గల్లంతైన విషయం విధితమే. ఈ మేరకు అగ్నిమాపక సిబ్బంది రెండు రోజుల నుంచి హరికృష్ణను ఆచూకీ కోసం వివిధ ఎక్యూప్‌మెంట్స్‌తో గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. ఫైర్ సిబ్బంది సందీప్‌కుమార్, మల్లికార్జునరెడ్డి, అనీఫ్, వెంకటేశ్వర్లు, చిదంబరంరెడ్డి, నరసింహులు, మహబూబ్‌లు రెండు రోజులుగా గాలింపు చర్యల్లో పాల్గొన్నారు. శనివారం సాయంత్రం 6 గంటల వరకు తీవ్ర స్థాయిలో గాలించారు. అయినా కూడా ఆచూకీ తెలియరాలేదు.

టూటౌన్ సీఐగా రాజశేఖర్‌రెడ్డి



ఆదోని అర్బన్: పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సీఐగా రాజశేఖర్‌రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం వీఆర్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడున్న సీఐ సూర్యమోహన్‌రావు బదిలీపై వెళ్లారు. సర్కిల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా అడ్డుకట్ట వేస్తామన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మల్‌ఖేడ్ పీఠాధిపతి


పీఠాధిపతిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం : మండలంలోని రాపురం గ్రామంలో ఎమ్మెల్యే స్వగృహంలో కర్ణాటక రాష్ట్రం మల్‌ఖేడ్ దర్గా పీఠాధిపతి సయ్యద్ షా ముస్తాఫా ఖాద్రీ శనివారం ఎమ్మెల్యే వై. బాలనాగి రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డిలను మర్యాద పూర్వకంగా కలిశారు. ఏప్రిల్ 5వ తేదీన మల్‌ఖేడ్ దర్గా ఉరుసు మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే పీఠాధిపతిని శాలువా, పూలమాలలతో సత్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. దర్గా సిబ్బంది ఇర్ఫాన్, మహమ్మద్, రంగా రెడ్డి, హసన్ బాషా ఉన్నారు.

ముగిసిన ఇంటర్మీడియెట్ పరీక్షలు


పరీక్షలు రాసి పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, నారాయణ కళాశాలలో ఈనెల 1వ తేదీ నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు శనివారం సెంకెండియర్ పరీక్షలతో ముగిశాయి. శనివారం ద్వితీయ సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు జరిగాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 121 మందికి గానూ 12 మంది గైర్హాజరు కాగా 119 మంది పరీక్షలకు హాజరైనట్లు పరీక్షల చీఫ్ లక్ష్మీ దేవి తెలిపారు. నారాయణ కళాశాలలో 119 మందికి గాను నలుగురు గైర్హాజరు కాగా 115 మంది హాజరయ్యారు. జనరల్ పరీక్షలు పూర్తి కాగా సోమ, మంగళ వారాల్లో ఒకేషనల్ పరీక్షలు ఉంటాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోయశాంత, మున్సిపల్ కమిషనర్, అధికారులు

ఆదోని టౌన్: ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మూడో శనివారం పట్టణంలోని శ్రీనివాస భవన్ నుంచి పెద్ద మార్కెట్, భీమా సర్కిల్ వరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడకూడదని అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడడం వల్ల ప్రజలు అనారోగ్యాల బారిన పడతారన్నారు. పట్టణంలో ఎక్కడైనా పారిశుద్ధ్యం లోపిస్తే మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

ఆదోని టౌన్: ప్రతి ఉద్యోగి ఆంధ్రప్రదేశ్‌ను స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఆర్టీసీ డిపో మేనేజర్ మహమ్మద్ రఫీక్ అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం డిపోలో ఉద్యోగులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. బస్‌స్టేషన్ ప్రాంగణంలోని పరిసరాలను పరిశుభ్రం చేసి, వ్యర్థాలను కాల్చి వేయించారు.

పెద్దకడబూరు : మండల కేంద్రంలోని 2వ వార్డు ప్రజలకు సర్పంచ్ రామాంజినేయులు ఆధ్వర్యంలో ఎంపీపీ శ్రీవిద్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి ప్రజలకు తడిచెత్త పొడిచెత్త డబ్బాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ జయరాముడు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బూత్ కమిటీ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలో ఎంపీడీఓ నాగరాజుస్వామి ఆధ్వర్యంలో ప్రధాన రహదారులను చీపురలతో శుభ్రం చేశారు. సర్పంచ్ రామాంజినేయులు ఆధ్వర్యంలో బ్యాగ్‌లను పంపిణీ చేశారు. టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జ్ రాఘవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

కౌతాళం: మండల కేంద్రంలో ఎంపీడీఓ సత్యన్న, సర్పంచ్ పాల్‌దినకర్ పురవీధుల గుండా ర్యాలీ చేపట్టారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో మానహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ యోగేశ్వర్ రెడ్డి, కార్యదర్శి శివప్ప తదితరులు పాల్గొన్నారు.

కోసిగి: స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి బాలికల పాఠశాల విద్యార్థినులు, హెల్త్ సిబ్బంది, గ్రామ పెద్దలతో కలిసి స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి మౌనిక ఆధ్వర్యంలో వైఎస్సార్ సర్కిల్‌లో ప్రతిజ్ఞ చేపట్టారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి, ఈఓపీఆర్డీ ఆరూన్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు

ఎమ్మిగనూరుటౌన్: ఒక సారి వినియోగించే ప్లాస్టిక్ వస్తువులతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి హెచ్చరించారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ర్యాలీని ఆయన ప్రారంభించారు. ర్యాలీ సోమప్ప సర్కిల్ మీదుగా గాంధీ సర్కిల్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ డీఈ రాజు, మున్సిపల్ డీఈ నీరజ, ఏఈలు శరత్‌చంద్ర, మదన్‌మోహన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలో స్థానిక సర్పంచ్, ఈఓ సతీష్, పంచాయతీ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థునులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్‌లో మానవహారం నిర్వహించి స్వచ్ఛంధ్ర, స్వర్ణాంధ్రపై ప్రతిజ్ఞ చేశారు.

నందవరం : మండల కేంద్రంలో ఎంపీడీఓ పుల్లయ్య, గ్రామ సర్పంచ్ తోట సావిత్రి, ఉప సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివప్ప గౌడ్, హాలహర్వి గ్రామంలో ఎంపీడీఓ, గ్రామ సర్పంచ్ మునెమ్మ నేతృత్వంతో స్వచ్ఛతపై ర్యాలీ నిర్వహించారు.

చర్చి సమీపంలో మరుగుదొడ్లు నిర్మించొద్దు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని న్యూ ఎస్సీ కాలనీ, బాబుజగ్జీవన్ రామ్ కాలనీ ముఖ ద్వారం సమీపంలో వున్న చర్చి వద్ద మరుగుదొడ్ల నిర్మాణాలను నిలిపి వేయాలని ఎంబీ చర్చి కార్యదర్శి భాస్కర్‌బాబు, సహాయ కార్యదర్శి తిమ్మరాజు, సుందర్‌రాజు కోరారు. శనివారం ఆ ప్రాంత వాసులతో కలిసి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. సామూహిక మరుగుదొడ్ల నిర్మాణంతో చర్చి ప్రాంతంలో దుర్గంధం వెదజల్లే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సంఘ నాయకులు సుధాకర్, దేవపుత్ర, రాజశేఖర్, ఆనంద్, ఎంఆర్‌పీఎస్ నాయకులు గిడ్డయ్య, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'పది' పరీక్షలు


నందవరం కేజీబీవీ పాఠశాల పరీక్షా కేంద్రం

నందవరం: పది పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. సోమవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. అరగంట ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. పరీక్ష కేంద్రాలను పరిశీలించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. విద్యార్థులందరికీ హాల్ టికెట్లను అందజేశారు. మండలంలో 575 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 336 మంది, కస్తూర్బా పాఠశాలలో 129 మంది, స్పెషల్ ప్రాథమిక పాఠశాలలో 110 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈఓ - 2 రఘునాథ్ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

కౌతాళంలో ఐదు కేంద్రాలు

కౌతాళం: మండలంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు కౌతాళంలో ఐదు సెంటర్లను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ-2 శోభారాణి తెలిపారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో రెండు సెంటర్లు, ప్రతిభ హైస్కూల్, కస్తూర్బా పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 898మంది రెగ్యూలర్ విద్యార్థులు, 144 ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు ఆమె వివరించారు.

పరీక్షలకు సర్వం సిద్ధం

కోసిగి: 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులకు అనుగుణంగా సర్వం సిద్ధం చేసినట్లు కోసిగి బాలుర ఉన్నత పాఠశాల చీఫ్ ఖలీల్ అహ్మద్ తెలిపారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఉంటుందన్నారు. విద్యార్థులు పరీక్షలకు 9గంటలకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. బాలుర ఉన్నత పాఠశాల ఏ, బి-సెంటర్‌లు , బాలికల ఉన్నత పాఠశాల, మౌంట్‌కార్మెల్ పాఠశాలలో సెంటర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుకు చర్యలు


స్థలాన్ని పరిశీలిస్తున్న గ్రామ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య

మంత్రాలయం : మండల కేంద్రం మంత్రాలయంలోని రామచంద్ర నగర్ సెల్ టవర్ ఏరియాలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య తెలిపారు. శనివారం ఎమ్మెల్యే వై. బాలనాగి రెడ్డి ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరాముడుతో కలిసి కాలనీలో డ్రైనేజీ నిర్మించే ప్రాంతాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండల గ్రాంటు కింద రూ.17లక్షలతో అడుగు ఎత్తు పైపులతో 500 మీటర్లు మేర డ్రైనేజీ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు.

పది పరీక్షలకు సౌకర్యాల కొరత


ఏపీ మోడల్ స్కూల్‌లో పనిచేయని ఆర్వో ప్లాంట్


గోనెగండ్ల : మండలంలో పదో తరగతి పరీక్షకు మూడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఎంపిక చేశారు. ఈ మూడు కేంద్రాల్లో 625 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బెంచీల కొరత వేధిస్తోంది. పదో తరగతి పరీక్షల కోసం కేజీబీవీ పాఠశాల, ప్రైవేట్ పాఠశాలల నుంచి బెంచీలు తీసుకువచ్చి ఆ పాఠశాలలో ఏర్పాటు చేసినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 240 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 172 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అయితే ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో తాగునీటి సమస్య ఉంది. దీంతో పరీక్షలు రాసే విద్యార్థులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వస్తుంది. అలాగే ఏపీ మోడల్ స్కూల్‌లో 214 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈ స్కూల్‌లో తాగునీటి ఆర్వో ప్లాంట్ చాలా రోజుల నుంచి పని చేయడం లేదు. దీంతో పరీక్షలు రాసే విద్యార్థులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. అధికారులు చొరవ తీసుకొని పరీక్ష కేంద్రాల్లో బెంచీలు, తాగునీటి సమస్య లేకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం

రేపటి నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. మండలంలో పదో తరగతి పరీక్షలకు మూడు కేంద్రాలను ఏర్పాటు చేశాం. మూడు కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాసేందుకు బెంచీలను ఏర్పాటు చేశాం. అలాగే పరీక్షలు రాసే విద్యార్థులకు తాగునీటి సమస్యతో పాటు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.


– నీలకంఠ, ఎంఈఓ-2, గోనెగండ్ల

వివాహిత అనుమానాస్పద మృతి


మహాదేవి (ఫైల్)

కౌతాళం: మండల పరిధిలోని తిప్పలదొడ్డి గ్రామానికి చెందిన ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు మృతురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. గ్రామానికి చెందిన మహాదేవి(35), పెద్ద గిడ్డయ్య భార్య భర్తలు. వీరు జీవనోపాధి నిమిత్తం గుంటూరుకు వలస వెళ్లి పనులు చేసుకుని జీవిస్తున్నారు. శుక్రవారం మహాదేవి మృతి చెందగా భర్త గిడ్డయ్య శనివారం శవాన్ని స్వగ్రామానికి వాహనంలో తీసుకువచ్చాడు. మృతదేహాన్ని చూసిన మృతురాలి అన్న ఈరన్న తన చెల్లి మృతిపై అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులకు సమాచారం అందజేశాడు. పోలీసులు గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాత్రి ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం ఆధారంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఆదోని సెంట్రల్: ఆదోని డివిజన్ పరిధిలోని కుప్పగల్ రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాం-2లో ఆఫ్‌లైన్ ట్రాక్ ప్రక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ గోపాల్ శనివారం తెలిపారు. అనారోగ్యంతో చనిపోయాడో, ఇతర కారణాలతో చనిపోయాడో తెలియదన్నారు. మృతుడు మాత్రం కాషాయం బట్టలు ధరించి ఉన్నాడని తెలిపారు. మృతుడిని గుర్తు పట్టడానికి అతని వద్ద ఎలాంటి ఆధారాలు లేవన్నారు. ఎవరైనా గుర్తిస్తే తమను సంప్రదించాలని కోరారు.

నిత్యం అందుబాటులో వైద్యులు



డాక్టర్ బాలజీకుమార్, ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్

ఎమ్మిగనూరురూరల్: ప్రభుత్వాసుపత్రిలో రోగులకు ఎప్పుడు వైద్యులు అందుబాటులో ఉంటూ వైద్యం అందిస్తున్నారని ప్రభుత్వాసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ బాలజీ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్ధ రాత్రి ప్రమాదాలు జరిగి, ఇతర ఏ సంఘటనలు జరిగి హాస్పిటల్‌కు వచ్చినా వైద్యం అందిస్తున్నామన్నారు. సీరియస్ అయితేనే పెద్దాసుపత్రులకు రెఫర్ చేయడం లేదని చెప్పారు. ఈ నెల 9వ తేదిన శిశువు మృతి చెందిన విషయాన్ని చెపుతూ.. బేబి రెండు పేగులు మెడకు చుట్టుకొని జన్మించటం వలన ఊపిరి తీసుకోవడం ఇబ్బందిగా ఉండటంతో కర్నూలుకు రెఫర్ చేశామన్నారు. అయితే బేబి తల్లిదండ్రులు కర్నూలుకు వెళ్ళ దారిలో ఓ ప్రైవేట్ హాస్పిటల్లో చూయిస్తే మరణించిందని చెప్పారని, బేబి మరణించడం చాలా బాధకరమైన విషయమన్నారు. అయితే ఇందులో వైద్యుల నిర్లక్ష్యం లేదని తెలిపారు. ప్రసవాల్లో ప్రభుత్వాసుపత్రి ముందుంటుందని చెప్పారు.

టార్గెట్ పూర్తి

ఆదోని అర్బన్: 2024 నుంచి 2025 ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డుకు ఇచ్చిన టార్గెట్ పూర్తి చేశామని యార్డు సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి శనివారం తెలిపారు. ఉన్నత అధికారులు ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డుకు రూ.17 కోట్లు సెస్సు రూపంలో టార్గెట్ ఇచ్చారన్నారు. యార్డులోని అసిస్టెంట్ సెక్రటరీ శాంత్‌కుమార్, సూపర్‌వైజర్‌లు జ్ఞానప్ప, మోహన్‌రెడ్డి, రాము, ఆనంద్‌కుమార్, నాగరాజు, శివ నరేష్, సిబ్బంది, యార్డులోని వ్యాపారుల సహాయంతో టార్గెట్ కంటే ఎక్కువగా వసూలు చేశామన్నారు. రూ.17 కోట్లకు గానూ రూ.17,15,81,000 వసూలయ్యిందన్నారు.

ఘనంగా కాన్సీరామ్ జయంతి


కాన్సీరామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్సీరామ్ 91వ జయంతిని మండల పరిధిలోని జాలవాడి గ్రామంలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. బీఎస్పీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జ్ జి.సామేలు అధ్యక్షతన రాష్ట్ర కార్యదర్శి మంచాల లక్ష్మీ నారాయణ కాన్సీరామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ కాన్సీరామ్ దేశంలో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సైకిల్‌పై తిరిగి అంబేద్కర్ ఉద్యమాన్ని, ఆలోచన విధానాన్ని వ్యాప్తి చేశారని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు శరణప్ప, సంజీవప్ప, దావీదు, నరసన్న తదితరులు పాల్గొన్నారు.